ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ.04.06.2026 సమయం.18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో పర్యటిస్తున్నారు.
2. న్యూఢిల్లీలో ఈరోజు భారత్ –యూకే క్రిటికల్ మినరల్స్ గ్లోబల్ సప్లయ్ చైన్ అబ్జర్వేటరీ శాటిలైట్ కేంద్రాన్ని కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి , యూకే విదేశాంగ మంత్రి ఇవెట్ కూపర్‌లు ప్రారంభించారు.
3. సవాళ్లను అవకాశాలుగా, కష్టాలను తమ బలంగా మార్చుకుని విజయాలు సాధిస్తున్న దివ్యాంగ క్రీడాకారులు సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు.
4. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించేందుకు ఉద్యమంతో సంబంధం ఉన్న పార్టీలు , విద్యార్థి సంఘాలు , న్యాయవాదులు, వైద్యుల అభిప్రాయాలు స్వీకరి స్తున్నట్లు కమిటీ చైర్మన్ కే. కేశవరావు తెలిపారు.

**రేవంత్**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో పర్యటిస్తున్నారు. తొలుత మక్తల్ లో మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించారు. అంతకుముందు, మక్తల్ - నారాయణపేట - కొడంగల్ ఎత్తిపోతల పథకం , భీమా, కృష్ణా నదులపై ప్రతిపాదిత బ్యారేజీల పనుల పురోగతికి సంబంధించి ఫోటో ఎగ్జిబిషన్, ప్లాన్ మ్యాప్స్

ద్వారా అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.  అనంతరం కోయిల్‌సాగర్ ప్రాజెక్టు , కృష్ణా-భీమా నదులపై ప్రతిపాదిత బ్యారేజీలు  , ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు డ్యామ్ ప్రాంతాన్ని ముఖ్యమంత్రి ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించారు. ముఖ్యమంత్రితో పాటు..  మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, వాకిటి శ్రీహరి, కర్ణాటక మాజీ మంత్రి బోసురాజు ఉన్నారు.

పిటిసి, మహబూబ్ నగర్

**క్రిటికల్ మినరల్స్ గ్లోబల్ సప్లయ్ చైస్ అబ్జర్వేటరీ శాటిలైట్ కేంద్రం**

న్యూఢిల్లీలో ఈరోజు భారత్–యూకే క్రిటికల్ మినరల్స్ గ్లోబల్ సప్లయ్ చైన్ అబ్జర్వేటరీ శాటిలైట్ కేంద్రాన్ని కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి  , యూకే విదేశాంగ మంత్రి ఇవెట్ కూపర్  లు సంయుక్తంగా ప్రారంభించారు. 2025లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ , యూకే ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ ద్వైపాక్షిక సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు దీనిని ఏర్పాటు చేశారు. ఈ అబ్జర్వేటరీ ప్రపంచంలోనే అతిపెద్ద డిజిటల్ మెటీరియల్ ఫ్లో మ్యాప్ రూపకల్పన కేంద్రంగా నిలవనుంది. క్లీన్ ఎనర్జీ , డిజిటల్ రంగాలకు అత్యవసరమైన ఖనిజాల సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేయడం దీని లక్ష్యం. వికసిత్ భారత్ 2047 లక్ష్య సాధనలో భాగంగా కేంద్ర ప్రభుత్వం 4 బిలియన్ డాలర్ల జాతీయ క్రిటికల్ మినరల్స్ మిషన్ చేపట్టిందని కిషన్ రెడ్డి తెలిపారు.

డెస్క్

**గవర్నర్**

సవాళ్లను అవకాశాలుగా , కష్టాలను తమ బలంగా మార్చుకుని విజయాలు సాధిస్తున్న దివ్యాంగ క్రీడాకారులు సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. హైదరాబాద్‌లోని రసూల్‌పురాలో ఈరోజు నిర్వహించిన ఆదిత్య మెహతా ఫౌండేషన్ "14వ ప్రెజెంటేషన్ అండ్ ఫెలిసిటేషన్ కార్యక్రమానికి " గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దివ్యాంగ క్రీడాకారులతో స్వయంగా మాట్లాడారు.  వారికి ఇస్తున్న తర్ఫీదును పరిశీలించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ ... క్రీడలు, శిక్షణ, పునరావాసం ద్వారా

దివ్యాంగుల సాధికారత కోసం ఆదిత్య మెహతా ఫౌండేషన్ చేస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు.

డెస్క్

**ఉద్యమ కారుల కమిటీ**

తెలంగాణ ఉద్యమకారులను గుర్తించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ ఈరోజు రెండవ అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించిందని కమిటీ చైర్మన్ కే.కేశవరావు తెలిపారు. ఉద్యమంతో సంబంధం ఉన్న పార్టీలు, విద్యార్థి సంఘాలు, న్యాయవాదులు, వైద్యులు అందరి అభిప్రాయాలు స్వీకరిస్తున్నామని వెల్లడించారు. 1969 నాటి తొలి తరం ఉద్యమకారులతో సహా చనిపోయిన వారి కుటుంబసభ్యులు , గాయపడిన వారు , జైలుకు వెళ్ళిన వారు , కవులు, కళాకారులు అందరినీ గుర్తించి గౌరవించడం లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

డెస్క్

**రాంచందర్ రావు**

తెలంగాణ సాధనలో బీజేపీ పాత్ర చారిత్రాత్మకమైనదని ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు అన్నారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఈరోజు 'మీట్ ది ప్రెస్ ' లో ఆయన మాట్లాడారు. తెలంగాణ బిల్లుకు బీజేపీ పార్లమెంట్‌లో బేషరతుగా మద్దతు ఇచ్చిందని, ఆ కీలక సమయంలో టీఆర్ఎస్ ఎంపీలు సభలోనే లేరని రాంచందర్ రావు గుర్తు చేశారు. కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి అవలంబించగా , బీజేపీ మాత్రం మాట మార్చకుండా నిలబడిందని అన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసమే ఉద్యమం జరిగిందని , కానీ, ఈ మూడు అంశాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు తెలంగాణకు తీవ్ర అన్యాయం చేశాయని రామచందర్ రావు విమర్శించారు.

డెస్క్

**డ్రగ్స్**

తెలంగాణ ఈగల్ పోలీసులు డ్రగ్స్ కేసులో కీలక ఆపరేషన్ నిర్వహించారు. దాదాపు నెల రోజుల పాటు నిఘా పెట్టి అంతర్జాతీయ డ్రగ్స్ స్మగ్లింగ్ ముఠాను అదుపులోకి తీసుకున్నారు.

కీలక నిందితుడు సహా 10 మంది డ్రగ్ పెడ్లర్లను అరెస్టు చేసిన ఈగల్ ఫోర్స్. నిందితుల నుంచి 12 కోట్ల రూపాయల విలువైన హైడ్రోఫోనిక్ గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

డెస్క్

**అగ్ని ప్రమాదం**

హైదరాబాద్ అమీర్‌పేటలోని ఓ షాపింగ్ కాంప్లెక్స్ లో ఈ మధ్యాహ్నం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. షాపింగ్ కాంప్లెక్స్ రెండో అంతస్తులో ఉన్న ఒక దుకాణంలో మంటలు చెలరేగాయి. క్రమంగా మంటలు ఇతర దుకాణాలకూ వ్యాపించాయి. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది 3 ఫైరింజన్లు, 8 వాటర్ ట్యాంకర్లతో మంటలు అదుపు చేశారు.

డెస్క్

**మేయర్స్ సమ్మిట్**

కరీంనగర్ గ్లోబల్ సిటీగా మారుతుండడం తెలంగాణకే గర్వకారణం అని నగర మేయర్ కొలగని శ్రీనివాస్ అన్నారు. ఉత్తరాఖండ్ రాష్ట్రం ఋషి కేష్ లో జరిగిన ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ మేయర్స్ 117 వ సమావేశంలో మేయర్ మాట్లాడుతూ... స్మార్ట్ సిటీ అంటే కేవలం సాంకేతికత మాత్రమే కాదని, ప్రజల జీవితాలను సులభతరం చేయడమని అన్నారు.

పిటిసి, కరీంనగర్

**ఉమెన్ ఫ్రెండ్లీ గ్రామ పంచాయతీ**

సంగారెడ్డి జిల్లాలోని ఫసల్‌వాది గ్రామ పంచాయతీ ఉమెన్ ఫ్రెండ్లీ థీమ్ కేటగిరీలో జాతీయ స్థాయిలో అవార్డు దక్కించుకుంది. మహిళా సాధికారత , మహిళలకు అనుకూలమైన సేవలు, సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రతిభ కనబరిచి ఫసల్ వాదీ పంచాయతీ జాతీయ స్థాయిలో మూడో ర్యాంకు సాధించింది. నిన్న సాయంత్రం న్యూఢిల్లీలో నిర్వహించిన జాతీయ పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో కేంద్ర పంచాయతీరాజ్ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ , కేంద్ర సహాయ మంత్రి ఎస్.పి. సింగ్ బఘేల్ అవార్డును ప్రదానం చేశారు.

**సంగారెడ్డి పీటీసీ**

**జనగామ జిల్లా కలెక్టర్**

అదనపు వాహనాలను కేటాయించి కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని రవాణా చేయడంలో వేగం పెంచాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సంబంధిత అధికారులను అదేశించారు. ఈరోజు నిర్వహించిన సమీక్షలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. .. అధికారులు పర్యవేక్షణ పెంచాలని అన్నారు.

పిటిసి, జనగామ

**భద్రాద్రి కొత్తగూడెం**

ప్రజా పాలన –ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా చండ్రుగొండ మండలం తిప్పనపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామ సభకు జిల్లా కలెక్టర్ అంకిత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ... గ్రామ సభల ద్వారా విద్య , వైద్యం, పారిశుద్ధ్యం, పర్యావరణ పరిరక్షణ , వర్షాకాలంలో అంటువ్యాధుల నివారణ వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

పిటిసి, భద్రాద్రీ కొత్తగూడెం

**చీఫ్ మినిస్టర్ ఓవర్సీస్ స్కాలర్ షిప్**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మైనారిటీ విద్యార్థులకు సంబంధించి... చీఫ్ మినిస్టర్ ఓవర్సీస్ స్కాలర్ షిప్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి అయేషా తలత్ ఒక ప్రకటనలో తెలిపారు.

**సిరిసిల్ల పీటీసీ**

**మినీ జాబ్ మేళా**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్ నగర్ లో ఎల్లుండి మినీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి కిరణ్ కుమార్ ప్రకటించారు.

**ఆసిఫాబాద్ పీటీసీ**

**ఏజెన్సీలో విత్తనాల పండుగ**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఖరీఫ్ సీజన్ పొలం పనులు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న ఆచారం ప్రకారం విత్తనాల పండుగ పూజలు నిర్వహిస్తున్నారు. లింగాపూర్ మండలం జాముల్ధార గ్రామంలో... కన్నెపల్లి పోచమ్మ తల్లి దేవస్థానంలో నిర్వహించిన విత్తనాల పండుగలో డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క, జైనూర్ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు విశ్వనాథ్ పాల్గొన్నారు.

**ఆసిఫాబాద్ పీటీసీ**

**హన్మకొండ**

పంట అవశేషాలను కాల్చవద్దని రైతులకు హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ సూచించారు. పంట వ్యర్థాల దహనంతో వాయు కాలుష్యం పెరిగి , పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందన్నారు.

**వరంగల్ పీటీసీ**

**ధాన్యం సేకరణ**

ధాన్యం సేకరణ, లోడింగ్ ప్రక్రియలో వేగం పెంచాలని , రాజన్న సిరిసిల్ల జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. మల్యాల గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.

పిటిసి, సిరిసిల్ల

**సూర్యాపేట కలెక్టర్**

దేశాభివృద్ధికి కీలకమైన జనగణన ప్రక్రియకు ప్రజలందరూ సహకరించి తమ వివరాలను పూర్తిస్థాయిలో నమోదు చేయించుకోవాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్ పిలుపునిచ్చారు. ఇంటింటికి వచ్చే సర్వే సిబ్బందికి సరైన సమాచారం అందించి జనగణన విజయవంతం కావడానికి తోడ్పడాలని సూచించారు.

పిటిసి, నల్గొండ

**నిర్మల్ ఎస్పీ**

డబ్బు ఆశతో తమ బ్యాంకు ఖాతాలు , ఏటీఎం కార్డులు , చెక్‌బుక్స్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ వివరాలను సైబర్ నేరగాళ్లకు అప్పగించి ఆన్‌లైన్ మోసాలకు సహకరించిన ఐదుగురిని అరెస్టు చేసినట్లు నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల తెలిపారు.

పిటిసి నిర్మల్ జిల్లా

**రంగారెడ్డి**

ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈరోజు రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం, కర్ణంగూడలో గ్రామసభ జరిగింది. జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని గ్రామస్థులతో మాట్లాడుతూ.. . ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు.

డెస్క్